
ధూళిమిట్ట మండలం కూటిగల్‌లో మావోయిస్టు కుంకటి వెంకటయ్య ఇల్లు

ఎట్లున్నరో..

● ఆపరేషన్ కగార్‌తో కలకలం ● అజ్ఞాతంలో ఐదుగురు ఉమ్మడి జిల్లా వాసులు

● మావోయిస్టు పార్టీలో కీలక స్థానాల్లో విధులు ● వరుస ఎన్‌కౌంటర్లతో కుటుంబసభ్యుల్లో ఆందోళన

● చెడు వార్త వినాల్సి వస్తుందేమోనని ఆవేదన ● అందరిదీ 20 ఏళ్ల క్రితమే అడవిబాట పట్టిన చరిత్ర

నక్సల్బరీ పోరాటాలు, పీపుల్స్‌వార్, జనశక్తి, ప్రస్తుత మావోయిస్టు ఉద్యమాలతో ఉమ్మడి మెదక్ జిల్లాకు విడదీయరాని బంధం ఉంది. ఆనాడు ప్రజలకు అండగా దుబ్బాక, నర్సాపూర్, గిరాయిపల్లి, ఇందుప్రియాల్ దళాలుగా పీపుల్స్‌వార్ పనిచేసింది, అదే విధంగా కూడవెల్లి, మంజీర దళాలతో జనశక్తి హవా నడిచింది. దేశంలోనే మొదటి ఎన్‌కౌంటర్ మెతుకుసీమలోని గిరాయిపల్లిలో జరిగింది. అప్పట్లో అది సంచలనం. నాలుగు దశాబ్దాల పోరాటంలో ఉమ్మడి జిల్లాకు చెందిన వందలాది మంది అడవిబాట పట్టారు. కొందరు నేలకొరగగా.. మరికొందరు లొంగిపోయారు. అయినా నేటికీ అజ్ఞాతంలో మరో ఐదుగురు ఉండటం గమనార్హం. వీరిలో ఇద్దరు పురుషులు, ముగ్గురు మహిళలు. వీరంతా ప్రస్తుత మావోయిస్టు పార్టీలో కీలక స్థానాలకు ప్రాతినిథ్యం వహిస్తున్నారు. అయితే వరుస ఎన్‌కౌంటర్లతో 'తమ బిడ్డలు ఎట్లున్నారో'.. అంటూ వారి కుటుంబ సభ్యులు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మే 25

1975 నుంచి 2004 వరకు విప్లవ పోరాటాలతో ఉమ్మడి మెదక్ జిల్లా హోరెత్తింది. సిద్దిపేట, నంగునూరు, చిన్నకోడూరు, గజ్వేల్, కొండపాక, తొగుట, దౌల్తాబాద్, దుబ్బాక, మిరుదొడ్డి, చేగుంట, నిజాంపేట, రామాయంపేట, మెదక్, పెద్దశంకరంపేట, చిన్నశంకరంపేట, పాపన్నపేట, కొల్చారం, నర్సాపూర్, కోహెడ, అక్కన్నపేట, హుస్నాబాద్, మద్దూరు మండలాల్లో మూడు దశాబ్దాల పాటు పీపుల్స్‌వార్, జనశక్తి గ్రూపుల ప్రాబల్యం ఉంది. ఆ తర్వాత మావోయిస్టు పార్టీగా మారడం, తెలంగాణలో కార్యకలాపాలు తగ్గిన నేపథ్యంలో అజ్ఞాతంలోకి వెళ్లేవారి సంఖ్య పూర్తిగా తగ్గింది.

ఐదుగురిదీ ఒక్కో గాథ..

● కోహెడ మండలం తీగలకుంటపల్లికి చెందిన ఖాతా రామచంద్రారెడ్డి అలియాస్ విజయ్ అలియాస్ గుడ్సా ఉసెండి అలియాస్ రాజుదాదా 31 ఏళ్ల క్రితం ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఉద్యోగాన్ని వదిలి అడవిబాట పట్టారు. ప్రస్తుతం చత్తీస్‌ఘడ్‌లోని ఈస్ట్ బస్తర్ అధికార ప్రతినిధిగా ఉన్న ఈయనపై రూ.20లక్షల రివార్డు ఉంది. ప్రస్తుతం ఆయన తల్లి వజ్రవ్వ అనారోగ్యానికి గురై నిమ్స్‌లో చికిత్స పొందుతోంది. భార్య, పిల్లలు హైదరాబాద్‌లో ఉంటున్నారు. కూతురు వివాహానికి కూడా రాలేదని చెబుతున్నారు.

● ధూళిమిట్ట మండలం కూటిగల్‌కు చెందిన కుంకటి వెంకటయ్య అలియాస్ శివన్న, అలియాస్ వికాస్ 30ఏళ్లుగా మావోయిస్టు పార్టీలో ఉన్నారు. పదో తరగతి పూర్తికాగానే అడవిబాట పట్టి ప్రస్తుతం దండకారణ్యం స్పెషల్ జోన్ సెక్రటరీగా కొనసాగుతున్నారు. వెంకటయ్యపై రూ.20లక్షల రివార్డు ప్రకటించారు. వెంకటయ్య తల్లిదండ్రులు, సోదరుడు చనిపోయారు. గ్రామంలో పాడుబడిన ఇల్లు మాత్రమే ఉంది.

● అక్కన్నపేట మండల కేంద్రానికి చెందిన కాశబోయిన స్వరూప 30 ఏళ్ల క్రితం అజ్ఞాతంలోకి వెళ్లింది. దండకారణ్యం సభ్యురాలిగా ఉన్న ఆమెపై రూ.లక్ష వరకు రివార్డు ఉంది. తన చిన్నతనంలోనే తల్లిదండ్రులు చనిపోతే నానమ్మ, తాత వద్ద పెరిగింది. పదో తరగతి చదువుతున్నప్పుడే ఉద్యమానికి ఆకర్షితురాలై అడవి బాట పట్టింది. ఆమె నానమ్మ, తాత చనిపోగా గ్రామస్థులు చందాలు వేసి అంత్యక్రియలు చేశారు. ప్రస్తుతం ఆమెకు చెల్లెలు ఉంది.

● నంగునూరు మండల కేంద్రానికి చెందిన రంగు అరుణ అలియాస్ పద్మక్క 20 ఏళ్లుగా మావోయిస్టుల్లో ఉన్నారు. చత్తీస్‌ఘడ్‌లోని దండకారణ్యం స్పెషల్ జోన్ కమిటీలో యాక్షన్ టీం మెంబర్‌గా ఉన్న పద్మక్కపై రూ.2లక్షల రివార్డు ఉంది. అరుణ తల్లి అనారోగ్యానికి గురై మంచం పట్టింది. తన కూతురు ఎక్కడుందో, ఎలా ఉందో తెలియదని చెబుతోంది.

● మిరుదొడ్డి మండలం ధర్మారానికి చెందిన రంగనబోయిన భాగ్య అలియాస్ కల్పన అలియాస్ రూపి 23 ఏళ్లుగా వివిధ హోదాల్లో మావోయిస్టు పార్టీలో కొనసాగుతున్నారు. ప్రస్తుతం నార్త్ బస్తర్ ప్రతాపూర్ ఏరియా కమాండర్‌గా ఉన్న భాగ్యపై రూ.4లక్షల రివార్డు ఉంది.


ఫైల్

వారంతా ఇక్కడి నుంచే..

నాటి పీపుల్స్‌వార్ నక్సల్స్‌గా, ఆ తర్వాత మావోయిస్టు పార్టీలో కీలకంగా వ్యవహరించిన నేతల్లో చాలామంది ఉమ్మడి జిల్లా నుంచి తమ ప్రస్థానం ప్రారంభించినవారే. శాఖమూరి అప్పారావు, సోలిపేట కొండాల్‌రెడ్డి, రావుల శ్రీనివాస్, దుబాషి శంకర్ కేంద్ర, రాష్ట్ర కమిటీలకు ప్రాతినిథ్యం వహిస్తూ నేలకొరిగారు. ఇక జనశక్తి గ్రూపులోనూ డేగల సుభాష్, రియాజ్, సంగన్న, భీమన్న దళాలూ మెతుకుసీమ పల్లెల్లో హవా సాగించాయి. ఆనాడు గిరాయిపల్లి, మేదినీపూర్, ఏడుపాయల, రామాయంపేట, ఇందుప్రియాల్, సీతారాంపల్లిలో జరిగిన ఎన్‌కౌంటర్లలో పెద్దసంఖ్యలో నక్సల్స్ చనిపోయారు.

ఆ ఘటనలు నేటికీ సంచలనమే..

1975లో కొండపాక మండలం గిరాయిపల్లి గుట్టల్లో ఎన్‌కౌంటర్ జరిగింది. దీనిని దేశంలోనే మొదటి ఎన్‌కౌంటర్‌గా చెబుతుంటారు. నలుగురిని ఇక్కడ ఎన్‌కౌంటర్ చేయడంతో గిరాయిపల్లి దళం ఏర్పాటుకు బీజం పడినట్లయ్యింది. చుట్టుపక్కల గ్రామాల్లోనూ ఆనాడు నక్సలిజంపై ఆసక్తి పెరిగింది.

మిగతా7లో..


ఫైల్


సంగారెడ్డిలో పరీక్షను పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

ప్రశాంతంగా
గ్రామపాలన అధికారి పరీక్ష

సంగారెడ్డి అర్బన్/మెదక్ అర్బన్, మే 25 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన గ్రామ పాలన అధికారి అర్హత పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 10.30 నుంచి 1.30 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. 265 మందికి 250 మంది హాజరయ్యారు. సంగారెడ్డి తారా కాలేజీలో పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ క్రాంతి, అదనపు కలెక్టర్ మాధురి పరిశీలించారు.

మెదక్‌లో 79 మంది హాజరు

మెదక్ జిల్లాలో గ్రామ పాలనాధికారి పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ఇందుకోసం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. డీఆర్వో భుజంగరావు పరిశీలించారు. 104 మంది అభ్యర్థులకు 79 మంది హాజరైనట్లు తెలిపారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో
22 మంది డిబార్

సంగారెడ్డి అర్బన్, మే 25 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో ఆదివారం జరిగిన ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల్లో 22 మంది డిబార్ అయ్యారు. ఉదయం జరిగిన ఫస్టియర్ పరీక్షల్లో నారాయణఖేడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఐదుగురు, టీజీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ కేంద్రంలో తొమ్మిది మంది డిబార్ అయ్యారు. మధ్యాహ్నం జరిగిన సెకండియర్ పరీక్షల్లో జోగిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇద్దరు, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఆరుగురు మాల్‌ప్రాక్టిస్‌కు పాల్పడుతూ డిబార్ అయ్యారు. నాలుగో రోజు గణితం, జువాలజీ, హిస్టరీ సబ్జెక్టు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. జిల్లావ్యాప్తంగా 28 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫస్టియర్ పరీక్షకు 4,492 మందికి 4,213 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సెకండియర్ పరీక్షకు 1,900 మందికి 1,827 మంది హాజరయ్యారని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవిందరామ్ తెలిపారు.

నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం

రైతులు అప్రమత్తంగా ఉండాలి : మెదక్ ఎస్పీ


మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, మే 25 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం మోపుతామని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆదివారం ఓ ప్రటనలో తెలిపారు. కష్టపడిన రైతు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత విత్తన సంస్థలు, డీలర్లు, వ్యాపారులదేనన్నారు. నాణ్యమైన విత్తనాలు మాత్రమే విక్రయించాలని సూచించారు. నకిలీ విత్తనాలు పట్టుపడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని, గతంలో ఇలాంటి కేసులతో సంబంధం ఉన్నవారిపై నిఘా పెట్టాలని సూచించారు. విత్తనాల కొనుగోలులో రైతులు అప్రమత్తంగా ఉండాలని, గుర్తింపు పొందిన కంపెనీ, ప్యాకింగ్, లేబుల్‌ను సరిచూసుకోవాలన్నారు. నకిలీ విత్తనాలు, అనుమానిత బ్రోకర్లు, డీలర్ల గురించి పోలీసు, వ్యవసాయాశాఖాధికారులకు సమచారం ఇవ్వాలని కోరారు.



పరిహారం అందేదెప్పుడో?

● త్రిపుల్ ఆర్ నిర్వాసితులకు అందని డబ్బు
● నర్సాపూర్ డివిజన్‌లో 1048 మంది రైతుల నుంచి 758 ఎకరాల సేకరణ
● తప్పని ఎదురుచూపులు

7



ఐఐటీహెచ్‌లో నేటి నుంచి
సాంస్కృతిక, సంగీత సదస్సు

● వారం రోజులు.. 1500 మంది హాజరు
● ప్రారంభించనున్న రాష్ట్ర గవర్నర్
● పాల్గొననున్న హరిప్రసాద్ చౌరాసియా

7

'భూ భారతి'కి సమస్యల వెల్లువ

● ఒక్క మండలంలోనే 1,045 అర్జీలు
● పాస్‌బుక్ కరెక్షన్ల కోసమే 326..
● 'ధరణి'లో దొర్లిన తప్పులే అధికం
● ప్రస్తుతానికి పెండింగ్‌లో సాదాబైనామాలు
● మెదక్ జిల్లాలో 'పైలెట్'గా చిలప్‌చేడ్ మండలం


గౌతంపూర్‌లో రెవెన్యూ సదస్సులో దరఖాస్తులను స్వీకరిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ (ఫైల్)

మెదక్, మే 25 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం తీసుకువచ్చిన 'ధరణి' పోర్టల్‌తో అనేక భూ సమస్యలు తలెత్తాయి. రికార్డులు తారుమారు కావడంతో రైతులు లబోదిబోమన్నారు. పరిష్కార మార్గం తెలియక ఆఫీసుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగారు. రైతుల వెతలు తీర్చడం కోసం ప్రస్తుత ప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకొచ్చింది. తెలంగాణ భూ భారతి (ఆర్వోఆర్-2025) చట్టం అమలుకు మెదక్ జిల్లాలో పైలెట్ ప్రాజక్టుగా చిలప్‌చేడ్ మండలాన్ని ఎంపిక చేశారు. ప్రతీ గ్రామంలో రెవెన్యూ సదస్సుల్ని ప్రయోగాత్మకంగా నిర్వహించారు. దీతో సమస్యల పరిష్కారం కోసం రైతులు సదస్సులకు పోటెత్తారు. 'ధరణి'లో కారణంగా తలెత్తిన భూ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో కొత్తగా దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో అత్యధికం ధరణి పోర్టల్‌లో నమోదైన తప్పులేనని నిర్ధారణ అయ్యింది.

పాస్‌బుక్ సవరణలే అత్యధికం

భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో పైలెట్ మండలమైన చిలప్‌చేడ్‌లోని 19 గ్రామ పంచాయితీల్లో అధికారులకు 1,045 దరఖాస్తులు వచ్చాయి. మండలంలో మొత్తం 5,736 సర్వే నంబర్లు ఉన్నాయి. కొందరు రైతులకు సంబంధించిన భూముల వివరాలు పూర్తిగా మాయమయ్యాయి. రెవెన్యూ అధికారుల అవినీతి, నిర్లక్ష్యం కారణంగా ఒకరి భూమి మరొకరి పేరిట నమోదు కావడం, భూమి లేకపోయినా పాస్‌బుక్కులు ఇవ్వడం, భూమి ఉన్నా పాస్‌బుక్కులు ఇవ్వకపోవడం వంటి తప్పులు చోటుచేసుకున్నాయని బాధిత రైతులు వాపోతున్నారు. రెవెన్యూ సదస్సుల్లో పట్టాదారు పాస్‌బుక్‌ల కరెక్షన్లపైనే అధిక దరఖాస్తులు వచ్చాయి. సర్వే నంబర్ల తప్పిదాలు, భూ విస్తీర్ణం తక్కువగా నమోదైందని, మిస్సింగ్ ఎక్స్‌టెంట్ ఉండడాన్ని సవరించాలని కోరుతూ 326 మంది దరఖాస్తు చేసుకున్నారు. 253 మంది సదాబైనామాలపై రాసుకున్న కొనుగోళ్లను క్రమబద్ధీకరించాలని అర్జీలు పెట్టుకున్నారు. సాదాబైనామా దరఖాస్తులు కటాఫ్ తేదీ 2014 జూన్ తర్వాత వచ్చినవిగా గుర్తించారు. తమ భూములు పౌతీ చేయాలంటూ 45, భూమి రికార్డుల్లో తక్కువగా నమోదు చేశారని 166, క్లాసిఫికేషన్-54, పట్టాదార్ పాస్‌బుక్కుల్లో పేర్లు సవరించమని 21, నిషేధిత భూముల్లో చేర్చడాన్ని సరిచేయాలని 6, ఇనాం భూములపై హక్కు కల్పించాలని 10, పెండింగ్ మ్యూటేషన్లు-12, డీఎస్ పెండింగ్-10, లతో పాటు ఇతరత్రా సమస్యల పరిష్కారం కోసం 395 మంది రైతులు రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకున్నారు.

ఒక్క మండలంలో ఇన్ని సమస్యలా?

పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన మండలంలోనే వెయ్యికి పైగా సమస్యలు వెలుగులోకి రావడంతో జిల్లావ్యాప్తంగా ఇంకెన్ని ఉంటాయోనని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిలప్‌చేడ్ మండలంలో రెవెన్యూ సిబ్బంది కొరత ఉండడంతో వచ్చిన దరఖాస్తులను వేగంగా, పారదర్శకంగా పరిష్కరించడం రెవెన్యూ యంత్రాంగానికి సవాల్‌గా మారింది. ఇతర మండలాల నుండి డిప్యూటేషన్‌పై రప్పించారు. పది మంది రాత్రింబవళ్లు పనిచేస్తున్నారు. ప్రస్తుతం సాదాబైనామా కాకండా మిగతా అంశాలన్నింటినీ జూన్ 2 వరకు పరిష్కరించనున్నట్లు రెవెన్యూ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మండలంలో పర్యటించిన సందర్భంగా ప్రకటించారు.

కొత్త తరహా అవినీతికి ఆస్కారం!

భూ భారతి పోర్టల్ అధికారాలను వికేంద్రీకరించారు. క్షేత్రస్థాయిలో విచారణ నివేదికలే కీలకం కానున్నాయి. ఈదశలో రెవెన్యూ సిబ్బంది రైతుల నుంచి డబ్బులు డిమాండ్ చేసే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.







సాగుకు సన్నద్ధం

వరుసగా కురుస్తున్న వర్షాలతో రైతులు పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు. రోహిణీ కార్తెలో రోళ్లు పగిలే ఎండ ఉంటుందంటారు. కానీ, ఈసారి అకాల వర్షాలతో వానాకాలాన్ని తలపిస్తున్నది. దీంతో, రైతులు దుక్కి దున్ని కొత్త పంటల సాగుకు చేలను సిద్ధం చేస్తున్నారు.

ఫొటోలు: సంగారెడ్డి జిల్లా ఫొటోగ్రాఫర్







అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



నర్సయ్య(ఫైల్)

● కుళ్లిన స్థితిలో మృతదేహం లభ్యం

కల్హేర్, మే 25(ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండల పరిధిలోని మునిగేపల్లి గ్రామంలో చోటు చేసుకున్నది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం మునిగేపల్లికి చెందిన కుర్మ నర్సయ్య(42), నగేష్ అన్నదమ్ములు. వీరు మరో వ్యక్తితో కలిసి ఇటీవల గ్రామంలో ఓ వ్యక్తికి చెందిన పాడి గేదెలను అపహరించి వికారాబాద్ ప్రాంతంలో అక్కడి పోలీసులకు పట్టుబడగా వారు కల్హేర్ పోలీసులకు అప్పగించారు. గేదెలను యజమానులకు అప్పగించి పోలీసులు విచారణ చేపడుతున్నారు. దొంగతనం కేసులకు భయపడిన అన్నదమ్ములిద్దరూ మరో వ్యక్తి వారి వ్యవసాయ భూముల వద్దనే కొన్ని రోజులుగా ఉంటున్నారు. ఇదిలా ఉండగా నాగ్‌ధర్ అటవి ప్రాంతంలో కుళ్లిన స్థితిలో ఉన్న వ్యక్తి మృతదేహాన్ని చూసిన స్థానికులు ఆదివారం కల్హేర్ పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి వెళ్లి పరిశీలించి కుర్మ నర్సయ్య మృతదేహంగా గుర్తించారు. దొంగతనం, విచారణ నేపథ్యంలో మనస్తాపం చెందిన నర్సయ్య ఆత్మహత్యకు పాల్పడ్డాడా, లేక ఎవరైనా హత్య చేసి అటవి ప్రాంతంలో పడేశారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలాన్ని కల్హేర్ ఎస్ఐ వెంకటేశం పరిశీలించి నర్సయ్య మృతికి కారణాలను ఆయన తండ్రి, సోదరుడిని అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు శవ పరీక్ష నిమిత్తమం మృతదేహాన్ని నారాయణఖేడ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.







రెచ్చిపోతున్న కాపర్ వైర్ దొంగలు

● రూ.లక్షల విలువ చేసే ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి అపహరణ

● తరచూ ఘటనలతో రైతులు, అధికారులు ఆందోళన

● పోలీసులు నిఘా పెంచి దుండగుల ఆటకట్టించాలని వినతి



గాగిళ్లాపూర్లలో ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ వైర్ ఎత్తుకెళ్లిన దొంగలు

మద్దూరు, మే 25 (ఆంధ్రజ్యోతి) : కాపర్ వైర్ల దొంగలు రెచ్చిపోతున్నారు. లక్షలు విలువ చేసే 25 కేవీ, 16 కేవీ మినీ ట్రాన్స్‌ఫార్మర్లను అర్ధరాత్రుల్లో పగులగొట్టి అందులోని కాపర్ వైర్‌ను అపహరించుకుపోతున్నారు. గతంలో రైతుల ట్రాక్టర్లలోని బ్యాటరీలను ఎత్తుకెళ్లిన దుండగులు ఇప్పుడు ట్రాన్స్‌ఫార్మర్లే లక్ష్యంగా వరుసగా చోరీలకు పాల్పడుతున్నారు. మద్దూరు మండలంలో పలు గ్రామాల రైతులు లోవొల్టేజి నివారణకు 25కేవీ, 16 కెవి ట్రాన్స్‌ఫార్మర్లు బిగించారు. వీటి విలువ రూ.80 వేలు, రూ.1.10 లక్షలు ఉంటుంది. ఈ నేపథ్యంలో తరచూ కాపర్‌వైర్ చోరీకి గురవుతుండడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇటీవల సలాఖ్‌పూర్, మర్మాముల, రేబర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైర్‌ని దుండగులు ఎత్తుకెళ్లారు. రెండు రోజుల క్రితం గాగిళ్లాపూర్‌లోని రెండు ట్రాన్స్‌ఫార్మర్లలో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనలపై విద్యుత్ శాఖాధికారులు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నా దొంగలు దొరికిన దాఖలాలు లేవు. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్‌వైర్ విలువ సుమారు రూ.20 వేలకు పైగానే ఉంటుందని సమాచారం. ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసినప్పుడల్లా తిరిగి కొత్తవి ఏర్పాటు చేసే క్రమంలో కొంత జాప్యం చోటుచేసుకోవడంతో రైతులు అసౌకర్యానికి గురవుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల దొంగల్ని పట్టుకుని ఆటకట్టించాలని విద్యుత్ శాఖాధికారులు, రైతులు పోలీసులను కోరుతున్నారు.

బందారంలో కాపర్ వైర్ చోరీ



కొండపాక, మే 25 (ఆంధ్రజ్యోతి) : ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైర్ చోరీకి గురైన సంఘటన కొండపాక మండలం బందారం గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కొమురయ్య, బట్ట ఐలయ్య వ్యవసాయ పొలాలవద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని దుండగులు పగుల గొట్టి అందులోని కాపర్ వైర్ చోరీ చేశారు. ఆదివారం ఉదయం రైతులు పొలాల వద్దకు వెళ్లి చూసే సరికి ట్రాన్స్‌ఫార్మర్ పగులగొట్టి ఉండడంతో అధికారులకు సమాచారం ఇచ్చారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



బూదయ్య (ఫైల్)

మాసాయిపేట, మే 25(ఆంధ్రజ్యోతి) : చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ చైతన్య కుమార్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మాసాయిపేట మండలం పోతనపల్లికి చెందిన అరికెల బూదయ్య(57) ఈ నెల 15న జాతీయ రహదారిపై రామంతాపూర్ వద్ద పని పూర్తి చేసుకుని వాహనంలో తిరిగి వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన అతడిని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. భార్య పోచమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చేగుంట ఎస్ఐ చైతన్య కుమార్ రెడ్డి తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



జాటోత్ లక్ష్మణ్ (ఫైల్)

చేగుంట, మే 25(ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యమైన సంఘటన చేగుంట మండలం పరిధిలోని జైత్రంతండాలో చోటుచేసుకుంది. చేగుంట ఎస్ఐ చైతన్య కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం తండాకు చెందిన జాటోత్ లక్ష్మణ్ (50) ఈ నెల 20 తన భార్య లక్ష్మితో కలిసి శివంపేట మండలం తాలపల్లితండాకు బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరిగి ఈ నెల 23న తూప్రాన్‌కు బస్సులో వస్తుండగా మార్గ మధ్యలో స్టేషన్ మాసాయిపేట వద్ద లక్ష్మణ్ బస్సు దిగి తిరిగిరాలేదు. అతని భార్య బస్సు దిగి వెతకగా ఆచూకీ లభించలేదు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆరోగ్య ప్రదాయిని అల్లనేరేడు

● సీజనల్‌లో మాత్రమే లభ్యం



నారాయణఖేడ్, మే 25(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం ప్రారంభం నుంచి లభించే అల్లనేరేడు పండ్లు (కాలాజామున్) వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. అల్లనేరేడు పండ్లను తినడం వల్ల డయాబెటిక్ రోగులకు ఎంతో మేలు జరగనున్నది. గుండె జబ్బులు రాకుండా నివారించగల్గుతుంది. దంత సమస్యల నుంచి రక్షణ కల్పిస్తుంది. డీ హైడ్రేషన్ నుంచి శరీరాన్ని రక్షించడమే కాకుండా వృద్ధాప్యాన్ని త్వరగా దరి చేరనీయ్యదు. రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. కంటి చూపు కూడా మెరుగుపరుస్తుంది. ఎముకలను బలంగా ఉంచడానికి ఉపకరిస్తాయి. శ్వాస సంబంధిత సమస్యలు తగ్గేందుకు ఈ పండ్లు ఎంతగానో ఉపయోగపడుతాయి. సీజన్ మొత్తం తరచూ తీసుకుంటే హిమోగ్లోబిన్ పెరగడానికి ఈ పండ్లు ఉపయోగపడతాయి. బీపీని అదుపులో ఉంచుతుంది. బ్రెయిన్‌ను చురుకుగా ఉంచడానికి దోహదపడుతాయి. డయేరియా, అల్సార్ వంటి వ్యాధులను నివారించగల్గుతాయి. గాయాలు తొందరగా మానుతాయి. జీర్ణక్రియ సక్రమంగా పని చేస్తుంది. కాలేయం పని తీరు వృద్ధి చెందడమే కాకుండా మూత్ర విసర్జన సక్రమంగా కొనసాగుతుంది. వర్షాకాలం ప్రారంభం నుంచి ఈ పండ్లు కాస్తుంటాయి. రంగు నలుపుగా ఉన్నప్పటికీ రుచి తక్కువగా వగరుగా ఉన్న ఆరోగ్య ప్రయోజనాలు ఉండడంతో, అన్ని వయస్సుల వారు ఈ పండ్లను తినడానికి ఇష్టపడతారు. నారాయణఖేడ్ ప్రాంతంలోని సత్యగామ, సిందోల్, తదితర గ్రామాల్లో ఈ పండ్లు పుష్కలంగా లభిస్తాయి. ప్రస్తుతం సీజన్ ప్రారంభం కావడంతో మార్కెట్‌లో కిలో రూ.200ల చొప్పున విక్రయిస్తున్నారు. ఇంకా పండ్ల దిగుమతి పెరిగితే ధర తగ్గే అవకాశం ఉంటుందని విక్రయ దారులు అంటున్నారు. ఏదేమైనా ఆరోగ్యానికి ప్రయోజనం చేకూర్చే అల్లనేరేడు పండ్లను తినడం వల్ల అనేక ఆరోగ్య సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



మనోహరాబాద్ పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

మనోహరాబాద్ మే 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించి ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం ప్రభుత్వ ఆసుపత్రిని ఆదివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని పలు విభాగాలను కలియ తిరుగుతూ పరిశీలించి వైద్యులకు తగిన సూచనలు చేశారు. పీహెచ్‌సీలో హాజరు పట్టికను పరిశీలించారు. ప్రతీ రోజు వచ్చే అవుట్ రోగులు ఎంత మంది వస్తున్నారని, మందులు అందుబాటులో ఉన్నాయా తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీరారు. నిరంతరం వైద్య సేవలు అందుతున్నాయా లేదా అని అడగగా అందుతున్నాయని రోగులు చెప్పడంతో ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యులు సిబ్బంది విధులకు సమయానికి రావాలని ఆదేశించారు. రోగులకు నిత్యం అందుబాటులో ఉండాలనానరు. ఆసుపత్రి లోపల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. అయితే కలెక్టర్ ఇప్పటివరకు రెండు సార్లు తనిఖీ చేయగా, ఒక్కసారి కూడా మండల వైద్య అధికారి జోత్స్నాదేవి అందుబాటులో లేకపోవడం గమనార్హం. ఆయన వెంట వినోదా, సురేష్ కుమార్, మధవి, శ్రావణ్, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మలేషియాలో అరెస్టయిన అబ్దుల్ ఖాదర్‌ను విడుదల చేయాలి

● మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్‌రావు



మలేషియాలోని కౌలాలంపూర్ హైకమిషన్ ఆఫ్ ఇండియా అధికారికి వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎంపీ రఘునందన్‌రావు

దుబ్బాక,మే25(ఆంధ్రజ్యోతి): అక్బర్‌పేట-భూంపల్లి మండలం పోతరెడ్డిపేట గ్రామానికి చెందిన మహమ్మద్ అబ్దుల్‌ఖాదర్ పొట్టకూటికోసం మలేషియా దేశానికి వెళ్లారు. అక్కడ కంపెనీలో వ్యక్తిగత విబేధాలతో అరెస్టుకు గురయ్యాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్ రావు ఆదివారం కౌలాలంపూర్ హైకమిషన్ ఆఫ్ ఇండియా అధికారికి వినతి పత్రాన్ని అందజేశారు. తక్షణమే అబ్దుల్‌ఖాదర్‌ను విడుదల చేసి స్వదేశానికి పంపించాలని కోరారు. అధికారులు కూడా సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు.


20కిలోల తూకంరాయి కాంటాలో 19.50కిలోలు చూపిస్తున్న దృశ్యం


వేరే కాంటాలో 42కిలోలు చూపిస్తున్న ధాన్యం బస్తా

ధాన్యం కొనుగోల్‌మాల్

- మర్రిముస్త్యాలలో కొనుగోలు కేంద్రం నిర్వాహకుల కక్కుర్తి
- తూకంలో మోసం.. అనుమానంతో పరిశీలన
- క్వింటాలుకు 2.50 కిలోల వ్యత్యాసం

చేర్యాల, మే 25 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండలం మర్రిముస్త్యాల ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులు అన్నదాతలను నిలువనా దోపిడి చేస్తున్నారు. సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి కొద్దిరోజులక్రితం ఈ కేంద్రాన్ని పరిశీలించి నిర్వాహకులకు చేసిన సూచనలను బేఖాతరు చేస్తూ ఎలక్ట్రానిక్ కాంటా తూకంలో మోసానికి పాల్పడుతున్నారు. గురుసాంద్రానంద గ్రామైక్యసంఘం ఆధ్వర్యంలో ఐకేపీ ద్వారా ఈ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయగా మద్దూరు మండల కేంద్రంలోని రామలింగేశ్వర మిల్లుకు కేటాయించారు. ఇప్పటివరకు 8వేల క్వింటాళ్ల ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేశారు. శనివారం 903 బస్తాలను కాంటా పెట్టినప్పటికీ 914 బస్తాలు కాంటా పెట్టినట్లుగా ట్రక్ షీట్‌లో పొందుపరిచారు. దీంతో అనుమానం బలపడిన రైతులు ఆదివారం కొనుగోలుకేంద్రంలోని ఎలక్ట్రానిక్ కాంటాలో 20కిలోల పరిమాణం తూకం రాయి పెట్టగా 19.50 కిలోలు మాత్రమే వచ్చింది. ఇతర కాంటాలో పెడితే 20 కిలోలు వచ్చింది. అంతేకాకుండా కొనుగోలుకేంద్రం వద్ద 41 కిలోల మేర ఉన్న ధాన్యం బస్తా మిల్లువద్ద కాంటా పెట్టగా 42కిలోలు వచ్చింది. ఈ లెక్కన క్వింటాలుకు 2.50కిలోల చొప్పున తేడా రావడంతో కొనుగోలుకేంద్రం నిర్వాహకులను నిలదీశారు. దీంతో వారు నీలునములుతూ కాంటాలు పాడైపోయాయని చెప్పడంతో ఆగ్రహం వ్యక్తంచేశారు. ఐకేపీ అధికారులకు తెలపడంతో ఏపీఎం శ్రీనివాస్‌రెడ్డి కొనుగోలుకేంద్రంతో పాటు మిల్లువద్ద ధాన్యం బస్తాలు, ఇతరత్రా రికార్డులను పరిశీలించారు. మోసం చేసిన నిర్వాహకురాలిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పరిహారం అందేదెప్పుడో?

- ట్రిపుల్ ఆర్ నిర్వాసితులకు అందని డబ్బు
- నర్సాపూర్ డివిజన్‌లో 1048 మంది రైతుల నుంచి 758 ఎకరాలు సేకరణ
- పరిహారం కోసం తప్పని ఎదురు చూపులు


పరిహారం అందలేదని సర్వేకు వచ్చిన అధికారులను అడ్డుకుని నిలదీస్తున్న ట్రిపుల్ ఆర్‌లో భూములు కోల్పోయిన రైతులు(ఫైల్)

నర్సాపూర్, మే 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ట్రిపుల్ ఆర్ కోసం భూములు ఇచ్చిన రైతులకు పరిహారం ఇదిగో అదిగో అంటూ అనుడే తప్పా ఎప్పుడు వస్తుందో కూడా స్పష్టత లేక రైతుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతుంది. గత జనవరి మాసంలోనే భూములు ఇచ్చిన రైతులకు పరిహారం త్వరలోనే అందుతుందని అప్పట్లో అధికారులు రైతులకు హామీ ఇచ్చారు. కానీ నెలలు గడుస్తున్నా ఆ పరిహారం రాకపోవడమే కాకుండా అధికారులకు కూడా ఆ విషయమై స్పష్టత లేకపోవడంతో ఎప్పుడు వస్తుందో అని రైతులకు ఎదురు చూడక తప్పడం లేదు.

మార్కెట్ ధర పెంచి పరిహారం ఇచ్చేందుకు నిర్ణయం

మొదట్లో ట్రిపుల్ ఆర్ కోసం భూములు ఇచ్చిన రైతులకు పరిహారం విషయంలో స్పష్టత లేకపోవడంతో నర్సాపూర్ డివిజన్‌లో భూములిచ్చిన రైతులు అధికారులు సర్వేకు వచ్చినప్పుడల్లా అడ్డుకుని పరిహారం విషయంలో తమకు న్యాయం జరగాలని ప్రస్తుత బహిరంగ మార్కెట్ ధర ప్రకారం చెల్లించాలని డిమాండ్ చేశారు. దీంతో అధికారులు ఉన్నతధికారులకు ఈ విషయం తీసుకెళ్లడంతో కలెక్టర్ జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీ వేశారు. మొదట ఎకరాకు రూ.13లక్షలు పరిహారం ఇవ్వాలని నిర్ణయించారు. కానీ రైతులు ససేమిరా అనడంతోపాటు వారి వినతి మేరకు దీనికి మూడింతలు ఇవ్వాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఆ పరిహారం ఇచ్చేందుకు ప్రభుత్వం కూడా ఒప్పుకుందని, తద్వారా రైతులకు ఎకరాకు రూ.40లక్షలకు పైగా పరిహారం వస్తుందని అధికారులు ఇక్కడి రైతులకు నచ్చజెప్పి ఎటువంటి అడ్డంకులు లేకుండా భూములు తీసుకున్నారు. దీంతో రైతులు కూడా తమకు ఎకరాకు రూ.40లక్షల వరకు వస్తుంది ఆ డబ్బులతో ఇతర చోట్ల భూములు కాని ప్లాట్లు లేక ఇతర వ్యాపారాలు పెట్టుకోవచ్చని ఆశతో ఉన్నారు. అయితే పరిహారం విషయమై అధికారులను అడిగినప్పుడల్లా ఇదిగో అదిగో అంటున్నారే తప్పా ఖచ్చితమైన సమాధానం రాకపోవడంతో రైతులు తీవ్ర నిరాశ నిస్పృహలు వ్యక్తం చేస్తున్నారు.

758 ఎకరాల సేకరణ

నర్సాపూర్ డివిజన్ పరిధిలో ట్రిపుల్ ఆర్ కోసం నర్సాపూర్, శివ్వంపేట మండాలల నుంచి 1048 పట్టాదారుల నుంచి 758 ఎకరాలను సేకరించారు. అందులో నర్సాపూర్ మండలం నాగుపల్లిలో 20 మంది రైతుల నుంచి 11.33 ఎకరాలు, మూసాపేటలో 98 మంది రైతుల నుంచి 76.28ఎకరాలు, మహ్మదాబాద్‌లో 56 మంది నుంచి 43.05, పెద్దచింతకుంటలో 62 మంది నుంచి 62.19, రెడ్డిపల్లిలో 78 మంది నుంచి 34.12, చిన్నచింతకుంటలో 18 మంది నుంచి 22.06 సేకరించారు. అలాగే ఖాజీపేటలో ఒకరి నుంచి 3.36, తిర్మలాపూర్‌లో 56 మందికి చెందిన 44.03, తుజాల్‌పూర్‌లో 80 మంది నుంచి 57.10ఎకరాలు సేకరించారు. అదేవిధంగా శివ్వంపేట మండలంలో లింగోజిగూడలో 105 మంది రైతుల నుంచి 42.12ఎకరాలు, కొత్తపేటలో 85 మంది నుంచి 51.23, రత్నాపూర్‌లో 127మంది నుంచి 98.01, పాంబండలో 30మంది నుంచి 37.02, ఉసిరికపల్లిలో 23మంది నుంచి 18.33, పోతులబోగుడలో 58మంది నుంచి 44.06, గుండ్లపల్లిలో 24మంది నుంచి 33.34, కొంతాన్‌పల్లిలో 127 మంది రైతుల నుంచి 76.16 ఎకరాల చొప్పున ట్రిపుల్ ఆర్ కోసం సేకరించారు. నర్సాపూర్ డివిజన్‌లో భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం రెండు విడతలుగా ఇవ్వనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. మొదటగా ఎకరాకు ప్రభుత్వ మార్కెట్ ధర ప్రకారం 13 లక్షల చొప్పున పరిహారం చెల్లించి ఆ తర్వాత రెండో విడతలో కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ ధరకు మూడింతలు ఇచ్చే పరిహారం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. గత పరిహారం జనవరి మాసం నుంచి అప్పుడిస్తాం.. ఇప్పుడిస్తాం అంటున్నారే కాని ఎప్పుడునేది ఇక్కడి అధికారులకు కూడా స్పష్టత లేకపోవడంతో రైతులకు కూడా వారు ఏమి చెప్పలేని పరిస్థితిలో ఉన్నారు. దీంతో రైతులు అధికారుల వద్దకు రావడం పరిహారం విషయం వాకబు చేయడం నిరాశతో వెనుదిరుగుతున్నారు. మరీ పరిహారం రైతులకు ఇప్పటికైనా స్పష్టత వస్తుందా లేదా చూడాలి.



ట్రిపుల్ ఆర్ మ్యాప్


పాపన్నపేట : వనదుర్గా మాత


పాపన్నపేట : వనదుర్గామాత అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


వర్గల్ : నాచగిరి లక్ష్మీనృసింహస్వామి

ఆధ్యాత్మిక శోభ

ఉమ్మడి జిల్లాలోని పలు ఆలయాలకు ఆదివారం భక్తులు పోటెత్తడంతో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. ప్రధాన ఆలయాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఆలయాల నిర్వాహకులు అన్ని ఏర్పాటు పూర్తి చేశారు.

వర్గల్, మే 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో భక్తుల సందడి నెలకొన్నది. దర్శనం కోసం క్యూలైన్లలో బారులు తీరారు. అనంతరం ఉప ఆలయాలైన అంజనేయ స్వామి, దత్తత్రేయ, సాయిబాబా, సీతారామాంజనేయ, శివాలయాలను దర్శించుకున్నారు.

కేతకీలో శివకోటి జపయజ్ఞం

ఝరాసంగం : కేతకిసంగమేశ్వర ఆలయంలో విశ్వమానవ ధర్మప్రచార పరిషత్‌కు చెందిన ప్రముఖుల ఆధ్వర్యంలో ఆదివారం శివకోటి జపయజ్ఞం ఘనంగా నిర్వహించారు.

నగర సంకీర్తన

జహీరాబాద్ : హరేరామ, హరేక్రిష్ణ సంస్థాన్‌కు చెందిన ట్రస్టు సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని నాగులకట్ట,హౌజింగ్ బోర్డు, శాంతినగర్, రాంనగర్, భవానిమందిర్ తదితర ప్రాంతాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. శ్రీకృష్ణుని భక్తిగీతాలను ఆలపిస్తూ తిరిగారు.

అఖండ లలితా సహస్ర నామ పారాయణం

జిన్నారం : మండలంలోని జగంపేట రేణుకా ఎల్లమ్మ దేవాలయం వద్ద ఘనంగా అఖండ లలితా సహస్ర నామ పారాయణం నిర్వహించారు. 160 మంది మహిళలు 11 సార్లు అఖండ లలిత సహస్ర పారాయణం చేశారు.

బోనాలు, ఒడిబియ్యం సమర్పణ

హుస్నాబాద్ : హుస్నాబాద్ పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ దేవి జాతర ఘనంగా నిర్వహించారు. భక్తులు ఎల్లమ్మ దేవిని దర్శించుకోవడానికి గంటల పాటు క్యూలైన్లలో నిరీక్షించారు. అమ్మవారికి ఒడి బియ్యం, బోనాలు, పట్నాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కాగా ఆలయం వద్ద కూర్చోవడానికి స్థలం లేక ఎండలో భక్తులు ఇబ్బందులు పడుతుంటే, ఆలయ సిబ్బంది, ఇతరులు మాత్రం తమ వాహనాలను షెడ్డులో పెట్టారు. దీంతో భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

వనదుర్గామాత ఆలయంలో..

పాపన్నపేట : ప్రసిద్ధ పుణ్య క్షేత్రం ఏడుపాయల వనదుర్గామాత ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. తెల్లవారుజామున 5.30గంటలకు అర్చకులు అమ్మవారికి అభిషేకం చేపట్టి సహస్రనామార్చన, కుంకుమార్చన అనంతరం దర్శనం కల్పించారు. మంజీరా నదీపాయల్లో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు మాతను దర్శించుకున్నారు. అమ్మవారికి పెద్ద ఎత్తున బోనాలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


ఖేడ్‌లో చౌకమేళ శోభాయాత్ర నిర్వహిస్తున్న మహిళలు, భక్తులు

సంత్ చౌకమేళ శోభాయాత్ర...

నారాయణఖేడ్ : సంత్ చౌక మేళ 687వ సమాధి మహోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం నారాయణఖేడ్‌లో భక్తులు భారీగా నిండు కలశాలు, కీర్తనలతో శోభాయాత్ర చేశారు. ఈ సందర్భంగా స్థానిక సత్యసాయి మందిరంలో ప్రత్యేక పూజలు, కీర్తనలు నిర్వహించిన అనంతరం పెద్ద ఎత్తున శోభాయాత్ర నిర్వహించారు.


ఝురాసంగం: కేతకీ ఆలయంలో శివకోటి జపయజ్ఞం


హుస్నాబాద్ : రేణుకా ఎల్లమ్మ ఆలయంలో బారులు తీరిని భక్తులు


జిన్నారం : అఖండ లలితా సహస్ర నామార్చనలో ..

భక్తజనమయం.. మల్లన్న ఆలయం

- సరస్వతీ పుష్కరాల భక్తుల తాకిడి
- స్వామివారిని దర్శించుకున్న ఐపీఎస్ అధికారి అన్నపూర్ణ


గంగిరేగుచెట్టు ప్రాంగణంలో భక్తజన సందోహం

చేర్యాల, మే 25 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయ సందర్శనార్థం ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయపరిసరాలు భక్తజనసందోహంగా మారాయి. సరస్వతీ పుష్కరాలను పురస్కరించుకుని కాళేశ్వరం వెళ్లిన భక్తులు తిరుగుముఖంలో మల్లన్నను దర్శింకోవడంతో రావడంతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా తలనీలాలు సమర్పించి కోనేరులో పుణ్యస్నాన మాచరించారు. భక్తిప్రపత్తులతో బోనం నివేదించి చెలక, నజరు, ముఖ మండప పట్నాలు రచించారు. స్వామివారిని దర్శించుకుని పట్టువస్త్రాలు, బండారి, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నిత్య కల్యాణంలో పాల్గొన్నారు. ఎల్లమ్మతల్లికి కల్లు, బెల్లంపానకం శాక పెట్టి బోనం నివేదించారు. తమను చల్లగా కాపాడుమని వేడుకున్నారు. తమ కోరికలు ఈడేర్చమని వేడుకుంటూ గంగిరేగుచెట్టుకు ముడుపు లు కట్టారు. స్వామివారి దర్శనంకోసం సుమారు 2గంటల సమయం పట్టింది. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈవో అన్నపూ ర్ణ, ఆలయ ఏఈవో శ్రీనివాస్, సూపరింటెండెంట్‌లు సురేందర్ రెడ్డి, శ్రీరాములు తదితరులు పర్యవేక్షించారు.

స్వామివారిని దర్శించుకున్న ఐపీఎస్ అధికారి అన్నపూర్ణ

హైదరాబాద్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ, ఐపీఎస్ అధికారి అన్నపూర్ణ ఆదివారం మల్లన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయాధికారులు స్వామివారి చిత్రపటం బహూకరించారు. అలాగే పర్యాటక శాఖ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వుప్పల శ్రీను కుటుంబసమేతంగా స్వామివారి దర్శించుకున్నారు.



(5వ పేజీ తరువాయి)

ఎట్లున్నరో..

ఈ గిరాయిపల్లి గుట్టలు చాలా ఏళ్ల నక్సల్స్‌కు షెల్టర్ జోన్‌గా ఉన్నాయి. ఆ తర్వాత మేదినీపూర్ ఎన్‌కౌంటర్‌లోనూ ఆరుగురు నక్సల్స్‌ను పోలీసులు హతమార్చారు.

● సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్‌లో 88 మంది నక్సల్స్ అమరుల పేర్లతో భారీ స్థూపాన్ని 1990లో ప్రారంభించారు. 2000వ సంవత్సరంలో మాజీ ఎమ్మెల్యే బొప్పరాజు లక్ష్మీకాంతరావు ఇంటిని నక్సల్స్ కూల్చివేయగా గ్రీన్‌టైగర్స్ పేరిట ఈ స్థూపాన్ని నేలమట్టం చేశారు. ఆసియాలోనే అతిపెద్ద అమరుల స్థూపంగా పదేళ్లపాటు సందర్శనీయ స్థలంగా మారింది.

● మెదక్ జిల్లా పాపన్నపేట పోలీస్‌స్టేషన్‌పై 1999లో పీపుల్స్ వార్ గ్రూపు బాంబులతో దాడిచేసింది. ఈ ఘటనలో ఐదుగురు పోలీసులు చనిపోయారు. ఈ ఘటన ఉమ్మడి రాష్ట్రంలో సంచలనం రేపింది. అప్పటి మంత్రి కరణం రాంచందర్‌రావు ఇంటిపైనా నక్సల్స్ దాడి చేయడం సంచలనమే.

● 1991లో హుస్నాబాద్ ప్రాంతంలోని రామవరం మందుపాతర ఘటనలో సీఐ యాదగిరి, ఎస్‌ఐ జాన్ విల్సన్, కానిస్టేబుళ్ల మరణించడం నేటికీ మరచిపోలేని సంచలనం.


అక్కన్నపేటలో మావోయిస్టు దళ సభ్యురాలు కాశబోయిన స్వరూప ఇల్లు

నా పానం ఆగమైతాంది



తొలుసూరు కాన్పు అని కూలిపని చేసి పెంచినం. కాలు వంక రైతే బాగు చేయించినం. 23ఏళ్ల కింద చవితినాడు పాశం తిన్న నా బిడ్డ గడప దాటిందంటే ఇగ కంటికి కానరాలేదు. నా పెనిమిటి చనిపోతే రాలే. ఏడేళ్ల కింద మా అత్త పోయినా రాలేదు. 30 మంది అన్నలు తెలంగాణోళ్లే అక్కడెక్కన్నే చనిపోయిండ్రంటే నా గుండె గుబులైతాంది. టీవీల సూస్తె ఏ చెడ్డ వార్త ఇనాల్నో అని పానం ఆగమైతున్నది. దినాము అన్నలు సనిపోతుండ్రని అంటుండ్రు. నా బిడ్డ కంటే ముంగల్నే గీ లోకం ఇడిసి నేనే పోవాలినని దేవున్ని మొక్కుతున్న.

- ఎల్లవ్వ, మావోయిస్టు భాగ్య తల్లి, ధర్మారం

నేటి నుంచి ఐఐటీహెచ్‌లో సాంస్కృతిక, సంగీత సదస్సు

- పాల్గొననున్న హరిప్రసాద్ చౌరాసియా తదితరులు
- వారం పాటు నిర్వహణ.. 1500 మంది హాజరు
- సదస్సును ప్రారంభించనున్న రాష్ట్ర గవర్నర్


ఐఐటీహెచ్‌లో సాంప్రదాయ నృత్యం చేస్తున్న విద్యార్థిని(ఫైల్)

కంది, మే 25 (ఆంధ్రజ్యోతి): యువతకు భారతీయ సంస్కృతిపై అవగాహన కల్పించేందుకు, సంప్రదాయ శాస్త్రీయ సంగీతాన్ని ప్రోత్సహించేందుకు, భారత నృత్య , కళా రీతులను ప్రదర్శించేందుకు సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదాబాద్‌లో స్పిక్ మకాయ్ 10 అంతర్జాతీయ సదస్సును ఏడు రోజులపాటు(మే 26 నుంచి జూన్ 1వరకు) నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రారంభిస్తారు. ఈ సదస్సులో పద్మ విభూషణ్ పండిట్ హరిప్రసాద్ చౌరాసియా(హిందుస్తానీ ఫ్లూట్), పద్మ భూషణ్ బేగం పర్వీన్ సుల్తానా(హిందుస్తానీ వోకల్), పద్మభూషణ్ డాక్టర్ ఎన్. రాజం(హిందుస్తానీ వయోలిన్) వంటి దాదాపు 20 మంది ప్రముఖులు ప్రత్యక్ష సంగీత కళా ప్రదర్శనలు ఇవ్వనున్నారు. సొసైటీ ఫర్ ది ప్రమోషన్ ఆఫ్ ఇండియన్ క్లాసికల్ మ్యూజిక్ అండ్ కల్చర్ అమాంగ్స్ యూత్(స్పిక్‌మకాయ్) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏటా దేశంలో ఏదో ఒక ప్రముఖ విద్యాసంస్థలో ఈ సదస్సును నిర్వహిస్తారు. ఈసారి ఐఐటీ హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. దేశ విదేశాల నుంచి సుమారు 1500 మందికి పైగా విద్యార్థులు, స్వచ్ఛంద సేవకులు ఈ వేడుకకు హాజరుకానున్నారు. "ఐఐటీహెచ్ క్యాంపస్‌లో వారం రోజుల పాటు శాస్త్రీయ సంగీత రాగాలు, లయలు ప్రతిధ్వనిస్తాయి. ఇది మాకెంతో గర్వకారణం. భారతీయ కళ, సంగీతంతో పాటు సంస్కృతి, శాస్త్రీయ కళలు, వాటి కాలాతీత విలువలను అర్థవంతంగా బహిర్గతం చేయడానికి ఈ వేడుక వీలు కల్పిస్తుంది" అని ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్.మూర్తి సంతోషం వ్యక్తం చేశారు.

న్యూస్ బాక్స్

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్



రోడ్డు మధ్యలో మూతలేకుండా ఉన్న మ్యాన్‌హోల్

గుమ్మడిదల, మే 25 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదల మున్సిపాలిటీలో సీసీరోడ్డు మధ్యలో మ్యాన్‌హోల్ మూత లేకుండా ప్రమాదకరంగా ఉన్నది. ఏ క్షణాన ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీ అధికారులు స్పందించి మ్యాన్‌హోల్‌పై మూతవేయాలని కోరుతున్నారు.

ఎస్‌ఐకి సన్మానం



ఎస్‌ఐని సన్మానిస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు

నర్సాపూర్, మే 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోనే ఉత్తమ పోలీస్‌స్టేషన్‌గా ఎంపికై మూడురోజుల క్రితం డీజీపీ చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకున్న ఎస్‌ఐ లింగంను ఆదివారం నర్సాపూర్‌కు చెందిన పలువురు యువకులు శాలువా కప్పి సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు అంతారం సుధీర్‌గౌడ్, హరీశ్‌వర్ధన్, ప్రసాద్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

భూభారతిపై అవగాహన సదస్సు

పాపన్నపేట, మే 25 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పొడ్చన్‌పల్లితండాలో తండాకు చెందిన యువ న్యాయవాది శ్రీకాంత్ ఆధ్వర్యంలో హైకోర్టు యువ న్యాయవాదులు ఆదివారం భూభారతి చట్టంలోని అంశాలు, రిజిస్ట్రేషన్, భూ హక్కులు, సివిల్, క్రిమినల్ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు మణిదీప్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

పాపన్నపేట, మే 25 (ఆంధ్రజ్యోతి) : మేతకు వెళ్లిన పాడిగేదె ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందింది. పాపన్నపేట మండలం కుర్తివాడ గ్రామానికి చెందిన పుట్టి వెంకటేశం వ్యవసాయంతో పాటు పాడి గేదెల ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజూ మాదిరిగానే ఆదివారం గేదెలను మేతకు తీసుకెళ్లాడు. గ్రామ శివారులోని ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గేదె మేత మేస్తూ షాక్‌కు గురై మృతిచెందింది. విద్యుత్ అధికారులు, గ్రామ పశువైద్యాధికారి అవారి రాకేష్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. విద్యుత్ అధికారులు నష్ట పరిహారం అందించాలని బాధిత రైతు వేడుకున్నాడు.

బాధితులకు పరామర్శ

జహీరాబాద్, మే 25 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ పట్టణంలోని ఈద్గా మైదానంలో శనివారం రాత్రి వక్ఫ్ చట్టంపై జరిగిన సమావేశంలో ప్రమాదవశాత్తు లైటింగ్ కూలడంతో గాయాలకు గురై ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పలువురిని సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు డా.సిద్ధం ఉజ్వల్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. గాయాలకు గురైనవారికి మెరుగైన వైద్యమందించాలని వైద్యులకు సూచించారు.

విద్యార్థినికి ట్యాబ్ బహూకరణ

నారాయణఖేడ్, మే 25 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించిన ఉప్పరి నందినికి యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్ ఆదివారం ట్యాబ్ బహూకరించారు. మారుమూల గ్రామమైన సిర్గాపూర్ మండలం చీమల్‌పాడ్‌కు చెందిన నందిని రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించడం గొప్ప విషయం అన్నారు. ఆమె ఉన్నత చదువులకు ఉపయోగపడే విధంగా ట్యాబ్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు శివపటేల్, యువజన కాంగ్రెస్ సిర్గాపూర్ మండల ఉపాధ్యక్షుడు నగేష్, యువజన కాంగ్రెస్ నాయకులు రహేమన్ పాల్గొన్నారు.

'మన్‌కీ బాత్'ను వీక్షించిన బీజేపీ శ్రేణులు

నారాయణఖేడ్, మే 25 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిర్వహించిన మన్‌కీబాత్‌ను ఆదివారం నారాయణఖేడ్ పట్టణంలో బీజేపీ శ్రేణులు వీక్షించారు. సంగారెడ్డి జిల్లాలో డ్రోన్ సహాయంతో వ్యవసాయం చేయడంపై ప్రధాని మన్‌కీబాత్‌లో ప్రస్తావించారని, ప్రధాని సంగారెడ్డి జిల్లాపై దృష్టి సారించారనేందుకు ఈ కార్యక్రమం నిదర్శనమని బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్ పట్నం మాణిక్, ఖేడ్ పట్టణ కార్యదర్శి సాయేందర్, ఉపాధ్యక్షుడు లోకేష్, ఏకనాథ్ పాల్గొన్నారు.

దశాబ్దాల సమస్యకు మోక్షం

- చెత్త తరలింపునకు ఏర్పాట్లు
- ఈపీటీఆర్ఐ నివేదిక కోరిన జీహెచ్ఎంసీ



ఐడీఏబొల్లారంలో కొండలను తలపిస్తున్న చెత్త

ఐడీఏబొల్లారం, మే 25 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా ఐడీఏబొల్లారం పురపాలక పట్టణంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా గృహాల వ్యర్థాలు పెరుగుతున్నాయి. దశాబ్దాలుగా చెత్తను పట్టణంలోనే నిల్వ చేస్తూ రావడంతో అది సమస్యగా మారింది. పట్టణంలో 11 వేలకు పైచిలుకు గృహాలు ఉన్నాయి. ప్రతీ ఇంటి నుంచి రోజువారీగా వ్యర్థాలు సేకరించి నిల్వ ప్రాంతాల్లో పారబోస్తున్నారు. చెత్తను నిల్వచేసే ప్రాంతం ఒకప్పుడు శివారు ప్రాంతంగా ఉండేది. ఇప్పుడు ఇళ్ల మధ్యలోకి రావడంతో నిత్యం ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఇదిలా ఉండగా చెత్తను రెండు రకాల పద్ధతుల్లో తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఒకటి బయోమైనింగ్ విధానం ద్వారా ఆధారిత ఉత్పత్తులు తయారు చేయడం, రెండవది జీహెచ్ఎంసీకి చెందిన జవహర్‌నగర్‌కు తరలించడం వంటి పద్ధతులపై అధికారులు సమాలోచనలు చేస్తున్నారు. దశాబ్దాల కాలంగా నిల్వలు ఉన్నందున మరో ప్రాంతానికి చెత్తను తరలించే సమయంలో ప్రమాదాలు ఉంటాయా అనే దానిపై గచ్చిబౌలిలోని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఈపీటీఆర్ఐ) అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలంటూ జీహెచ్ఎంసీ అధికారులు కోరారు. నివేదిక వచ్చిన తరువాత చెత్తను తరలించడానికి రూ.50 లక్షలు పైచిలుకు ఖర్చు అయ్యే అవకాశాలు ఉన్నాయని అధికారులు లెక్కలు వేస్తున్నారు. చెత్త తరలింపుపై రాంకీ సంస్థ సైతం అధ్యయనం చేస్తోంది. దీనిపై ఇప్పటికే కమిషనర్ మధుసూదన్‌రెడ్డి ఆయా శాఖల అధికారులతో సమాలోచనలు జరుపుతున్నారు.

రైతు సమస్యలపై ప్రభుత్వానికి పట్టింపేది?

- పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి



శివంపేట సొసైటీలో మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న అంజిరెడ్డి, గోదావరి

పుల్‌కల్, మే 25 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి ఆరోపించారు. చౌటకూర్ మండలం తాడ్దానిపల్లి చౌరస్తా వద్ద ఆదివారం పాల కేంద్రం ప్రారంభోత్సవానికి బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి, మాజీ ఎంపీ బీబీపాటిల్, బీజేపీ సీనియర్ నాయకులు రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే, వెంకటనరసింహరెడ్డిలతో కలిసి హాజరయ్యారు. ముందుగా ప్రధాని నరేంద్రమోదీ 122వ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం శివంపేట సొసైటీలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పిదాలనే కాంగ్రెస్ చేస్తుందని ఆరోపించారు. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని విమర్శించారు. యాసంగి సీజన్ వరి ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో రైతులు అవస్థలు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రులు మొదలుకుని జిల్లాస్థాయి ఉన్నతాధికారుల వరకు ధాన్యం సేకరణపై కనీసం సమీక్షించకపోవడం సిగ్గుచేటన్నారు. కొనుగోళ్లలో జాప్యం వల్ల అకాల వర్షాలకు యాసంగి వరి ధాన్యం ఎక్కడికక్కడ తడిసి మొలకలెత్తాయని విచారం వ్యక్తం చేశారు. వారం, పక్షం రోజుల పాటు కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు నిరీక్షిస్తున్న వారికి కనీస సౌకర్యాలను సమకూర్చడంలో నిర్వాహకులు విఫలమయ్యారని ఆరోపించారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి వెంటనే రైస్‌మిల్లులు, గోదాములకు తరలించాలని అంజిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీజేపీ పుల్కల్ మండల అధ్యక్షుడు అమ్మల నవీన్, నాయకులు పల్వట్ల జగదీశ్వర్, కొల్కూరి రాజశేఖర్‌రెడ్డి, డాకూరి భూమయ్య, శ్యామాగౌడ్, గాజుల అనిల్‌కుమార్, ఆత్కూరి లక్ష్మణ్, మిన్‌పూర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

మునిపల్లి, మే25 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం ఎడతెరిపి లేకుండా కురుస్తున్న అకాల వర్షాలకు తడుస్తున్న జొన్న పంటను కొనుగోలు చేయాలని మాజీ జడ్పీటీసీ పైతర మీనాక్షిసాయికుమార్ ప్రభుత్వాన్ని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని పీఎస్ఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులు కష్టించి పండించిన జొన్న పంట వర్షంలో తడవడంతో కొనుగోలు చేయడం లేదని, తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలన్నారు.

'ఆధార్' కష్టాలు..!

- మండలంలో ఆధార్ సెంటర్ లేక అవస్థలు
- సదాశివపేటకు వెళ్తున్న ప్రజలు
- అందినకాడికి దండుకుంటున్న ఆధార్ కేంద్రం నిర్వాహకులు

మునిపల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి) : మునిపల్లి మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ లేకపోవడంతో ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. కొత్తగా ఆధార్‌కార్డు దరఖాస్తు చేయాలన్నా.. ఆధార్‌లో తప్పొప్పులు, చిరునామాలు సరి చేసుకోవాలన్నా సదాశివపేట, సంగారెడ్డికి వెళ్లక తప్పడం లేదు. పీఎం కిసాన్ అప్‌డేట్, మొబైల్ లింక్స్ తప్పనిసరి అని అధికారులు చెప్పడంతో ఆధార్ సెంటర్ల వైపు ప్రజలు, రైతులు పరుగులు పెడుతున్నారు. గతంలో మునిపల్లి మండలం బుదేరా ఏపీజీవీబీలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రం తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంకుగా మారడంతో ఆధార్ సెంటర్‌ను తీసివేశారు. దీంతో కొన్నిరోజులు కంకోల్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో సేవలందించారు. కానీ ఏం జరిగిందో ఏమో కానీ అక్కడా తీసేయడంతో ఆధార్ సేవల కోసం పడరాని పాట్లు పడుతున్నామని మండలవాసులు వాపోతున్నారు. మండలంలో ఆధార్ సెంటర్ లేకపోవడంతో సదాశివపేటలోని ఎస్‌బీఐ బ్యాంకు ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌కు వెళ్తున్నారు. అదే అదునుగా భావించిన సదాశివపేట ఆధార్ సెంటర్ నిర్వాహకులు అందినకాడికి దండుకుంటున్నారు. మొబైల్ లింకు కోసం ప్రజలు వెళ్లి రూ.50 తీసుకోవాల్సి ఉండగా రూ.100 నుంచి రూ.150 వసూలు చేస్తున్నారు. మిగతా వాటికైతే చెప్పనక్కర్లేదు. గత్యంతరం లేక అడిగినన్ని డబ్బులు ఇవ్వక తప్పడం లేదు. అధికారులు స్పందించి మునిపల్లి మండలంలో ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

భూములు కోల్పోతున్న రైతులకు అండగా బీఆర్ఎస్

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న గోవర్ధన్‌రెడ్డి, తదితరులు

గుమ్మడిదల, మే 25 (ఆంధ్రజ్యోతి) : భూములు కోల్పోతున్న రైతులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం గుమ్మడిదలలోని సీజీఆర్ క్యాంపు కార్యాలయంలో మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్, పార్టీ నాయకులు, రైతులతో కలిసి మాట్లాడారు. ఇండస్ట్రియల్ ఐటీ పార్కు ఏర్పాటు చేసేందుకు గుమ్మడిదలలో ప్రభుత్వం సర్వే నంబరు 109లోని 157 ఎకరాల భూములను రైతుల నుంచి సేకరించే కార్యక్రమం జరుగుతుందన్నారు. కానీ ఇన్నిరోజులు వ్యవసాయం చేసుకుని జీవనోపాధి పొందుతున్న రైతులకు కనీస మార్కెట్ ధర కూడా ఇవ్వకుండా అన్యాయం చేస్తోందని ఆరోపించారు. రైతులకు న్యాయం జరిగే వరకూ పార్టీలకతీతంగా కలిసి ప్రభుత్వంపై పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు అమ్మగారి సదానందరెడ్డి, బాలకృష్ణారెడ్డి, దేవేందర్‌రెడ్డి, ఆకుల సత్యనారాయణ, వాసుదేవరెడ్డి, బండాల భాస్కర్, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి, పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే సంజీవరెడ్డి



ఖేడ్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్/మునిపల్లి/చేగుంట, మే 25(ఆంధ్రజ్యోతి) : అభివృద్ధితో పాటు పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. ఆదివారం ఖేడ్‌లో సీఎం సహాయనిధి ద్వారా బీబీపేటకు చెందిన శోభకు రూ.25 వేలు, అంజిరెడ్డికి రూ.20 వేలు మంజూరు కాగా.. అందుకు సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మల్లేశం, నాయకులు సంగన్న, సాయిలు, సంగమేశ్వర్, అంజయ్య, రాజునాయక్, తదితరులు పాల్గొన్నారు. మునిపల్లి మండలం పెద్దగోపులారం గ్రామానికి చెందిన నేతి వీరన్నకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు మాజీ ఎంపీటీసీ బుర్కల పాండు ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాయికోడ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అమరేశ్వర్, కాంగ్రెస్ నాయకులు నరేందర్ చారి, మహేందర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు. చేగుంట మండలం చందయ్యపేట గ్రామానికి చెందిన చాకలి అశోక్‌కు రూ.60 వేలు, కురుమ కొమురయ్యకు రూ.15 వేలు ఎంపీ రఘునందన్‌రావు ఆదేశాల మేరకు బీజేపీ నాయకులు ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి జూకంటి శోభన్, చందాయిపేట్ బీజేపీ యూత్ అధ్యక్షుడు బండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను పెంపొందించేందుకు 'ఉన్నతి'

కొండాపూర్, మే 25 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల నైపుణ్యాలను వెలికితీసి నైపుణ్యాన్ని పెంపొందించడానికి గురుకుల సంస్థల సొసైటీ తమ 'ఉన్నతి' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని గిర్మాపూర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సుధాకర్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. అణగారిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య, సమగ్ర అభివృద్ధి అందించడంలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 30 రోజుల పాటు ఉపాధి శిక్షణ ఉంటుందన్నారు. 18 నుంచి 25 ఏళ్ల వయస్సుగల గురుకుల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ సుధాకర్ తెలిపారు.

గురుకులాల ఎత్తివేతతో పేద విద్యార్థులకు తీవ్ర నష్టం

- కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొటారి నర్సింహులు

నారాయణఖేడ్, మే 25 (ఆంధ్రజ్యోతి) : సాంఘిక సంక్షేమ గురుకులాల్లోని జూనియర్ కళాశాల ఎత్తివేతతో పేద దళిత విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుందని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొటారి నర్సింలు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం ఖేడ్‌లో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని 11 జిల్లాల్లో ఉన్న 12 సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ఇంటర్మీడియట్ కళాశాలలను ఎత్తేసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద విద్యార్థులకు తీవ్రనష్టం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని రాయికోడ్ గురుకుల జూనియర్ కళాశాలను, కొండాపూర్ కళాశాలలో బైపీసీ కోర్సు జహీరాబాద్‌లో ఎమ్మెల్టీ, సింగూర్‌లో వొకేషనల్, హత్నూరలో ఫార్మటెక్నాలజీ, బైపీసీ గ్రూపుల ఎత్తివేతకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. ప్రభుత్వం తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

నీటి పన్ను పెంచితే మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం

- బీజేపీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు బాసంగారి వెంకట్

సిద్దిపేట క్రైం, మే 25 (ఆంధ్రజ్యోతి): పెరిగిన నిత్యావసర సరుకుల ధరలతో ఇబ్బంది పడుతున్న పేద ప్రజలపై సిద్దిపేట మున్సిపల్ పాలకవర్గం అధిక పన్నులు మోపడం సరికాదని సిద్దిపేట పట్టణ బీజేపీ అధ్యక్షుడు బాసంగారి వెంకట్ ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డులలో ఇప్పటివరకు నెలకు రూ.150 గా ఉన్న నల్లా బిల్లును పెంచే ఆలోచనలో మున్సిపల్ పాలకవర్గం ఉందని తెలిపారు. ఈ యోచనను మున్సిపల్ పాలకవర్గం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే బీజేపీ ఆధ్వర్యంలో ప్రజల పక్షాన మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

తొగుట మండలంలో ఎమ్మెల్యే పర్యటన

తొగుట, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుక్కాపూర్, పెద్ద మాసాన్‌పల్లి గ్రామాల్లో ఆదివారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాల్లో జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం పెద్దమాసాన్‌పల్లి గ్రామంలో ఇటీవల మృతిచెందిన బీఆర్ఎస్ నేత సిద్దాగౌడ్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక దివంగత మాజీ ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి సతీమణి సుజాతమ్మ, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రాంరెడ్డి, మాజీ అధ్యక్షుడు మల్లారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తిరంగాయాత్ర



తిరంగా యాత్రలో మున్సిపల్ నాయకులు

ఐడీఏబొల్లారం, మే 25 (ఆంధ్రజ్యోతి) : సిందూర్ ఆపరేషన్‌లో భారత త్రివిధ దళాల విజయానికి దేశం జేజేలు పలుకుతున్న నేపథ్యంలో ఐడీఏబొల్లారం పట్టణంలో తిరంగాయాత్ర వైభవంగా నిర్వహించారు. జాతీయ జెండా పట్టుకొని పార్టీలకతీతంగా పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. సైనికులకు మద్దతుగా యాత్ర జరిపారు. హనుమాన్ మందిరం నుంచి బస్టాండ్ వరకు యాత్ర జరిపారు. ఈ కార్యక్రమంలో సీఐ రవీందర్‌రెడ్డి, చంద్రారెడ్డి, హనుమంతురెడ్డి, రాజిరెడ్డి, ఆనందకృష్ణారెడ్డి, జైపాల్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, వరప్రసాద్‌రెడ్డి, సీతారాంరెడ్డి, హరికృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన



రాయికోడ్‌లో ఉపాధి పనులను పరిశీలిస్తున్న కేంద్రం బృందం సభ్యులు

రాయికోడ్, మే 25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన రాయికోడ్‌తో హస్నాబాద్ గ్రామంలో చేపట్టిన ఉపాధిహామీ పథకం పనులను ఆదివారం కేంద్ర ఉపాధిహామీ కమిటీ సభ్యులు పరిశీలించారు. రాయికోడ్‌లోని రైతువేదికతో పాటు మెటల్, సీసీ, ఫార్మేషన్ రోడ్లను పరిశీలించారు. హస్నాబాద్ గ్రామంలోని నర్సరీలు, రైతువేదికలు, శ్మశానవాటికలు, ఉపాధిహామీ పథకంలో చేపట్టిన రోడ్లను పరిశీలించి మాట్లాడారు. గ్రామాల్లో చేపట్టిన పనులను పరిశీలించి నివేదికను కేంద్రానికి అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వశాఖ డిప్యూటీ సెక్రెటరీ సంజయ్‌కుమార్, కేంద్ర ఎన్ఆర్ఈజీఎస్ టెక్నికల్ అధికారి పంకజ్ కుమార్‌రాణా, అధికారులు శశికుమార్, కృష్ణమూర్తి, మురళీధర్, ఆబేద్‌ఖాన్, జ్యోతి, బాల్‌రాజ్, ఎంపీడీవో, ఎంఎం.ఖాన్ ఉపాధిహామీ సిబ్బంది రమేష్, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అల్లాదుర్గం: సమ్మేళనంలో విద్యార్థులు

అల్లాదుర్గం/పెద్దశంకరంపేట, మే 25 (ఆంధ్రజ్యోతి) : అల్లాదుర్గం మండలంలోని చిల్వర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2000 సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు, పెద్దశంకరంపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1981-1982 సంవత్సరంలో చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అలనాటి స్మృతులను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. ఆనాడు విద్యాబోధన చేసిన గురువులను ఘనంగా సత్కరించారు.



పెద్దశంకరంపేట: సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

పలు గ్రామాల్లో కాంగ్రెస్ కమిటీలు ఏర్పాటు

చిన్నశంకరంపేట, 25 మే (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ అధ్యక్షులను ఎన్నుకున్నారు. జంగరాయి కాంగ్రెస్ అధ్యక్షుడిగా సాగర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారిగా ప్రభాకర్, కార్యదర్శిగా వడ్ల రాజు, కార్యవర్గ సభ్యులుగా లక్ష్మీపతి, రామకృష్ణారెడ్డి ఎన్నికయ్యారు. అలాగే ధర్పల్లి గ్రామ అధ్యక్షుడిగా చింతకుంట ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా తడకపల్లి మల్లేష్, ఉపాధ్యక్షుడిగా అంజాగౌడ్, బాలేష్, సహాయ కార్యదర్శిగా వెంటారెడ్డి, కిష్టారెడ్డి, సోషల్ మీడియా అధ్యక్షుడిగా వడ్ల శ్రీకాంత్ ఎన్నికయ్యారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాన సత్యనారాయణ ఆదేశాల మేరకు కమిటీలను నియమించినట్లు మండల ఉపాధ్యక్షుడు బందుల సాయిలు, మాజీ సర్పంచ్ నెల్లూరు తెలిపారు.

ఎల్లమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపనకు నిధుల సేకరణ



ఇంటింటికి తిరుగుతూ నిధులు సేకరిస్తున్న మల్లేశ్‌గౌడ్‌రాధా


నర్సాపూర్, మే 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొల్లపల్లిలో నిర్మించిన ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనలో గ్రామస్థులందరినీ భాగస్వాములు చేయాలనే సంకల్పంతో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్‌మల్లేష్‌రాధా దంపతులు తన సొంత గ్రామమైన గొల్లపల్లిలో ఇంటింటికి తిరిగి నిధులు సేకరించారు. 28 నుంచి ప్రతిష్ఠాపనలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు రాజుగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, సత్యనారాయణగౌడ్, ఒగ్గు సత్యనారాయణ, గొల్ల మల్లేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దైవచింతన కలిగి ఉండాలి

- సమరసనంద అచల పీఠాధిపతి అశోక్‌మహరాజ్

చిన్నశంకరంపేట, మే 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ దైవచింతన కలిగి ఉండాలని సమరసనంద అచల పీఠాధిపతి అశోక్‌మహరాజ్ సూచించారు. ఆదివారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని ఎలబోయిన బాబు స్వగృహంలో గురుపాద ఆరాధన పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌మహరాజ్ పాద పూజ చేసి భక్తులకు ఆశీర్వచనాలు అందించి మాట్లాడారు. ప్రజలు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని, భగవంతుడిని పూజించాలన్నారు. ఈ కార్యక్రమంలో గురువులు కృష్ణస్వామి, వీరయ్య, భయ్యా నారాయణ, జ్ఞానేశ్వర్, పోచయ్య పాల్గొన్నారు.

వైన్స్‌తో ట్రాఫిక్ తిప్పలు



తెల్లాపూర్‌లోని వైన్స్

రామచంద్రాపురం, మే 25 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం తెల్లాపూర్‌లోని ఓ వైన్స్ యజమాని నిర్వాకంతో ప్రజల ప్రాణాలు పోతున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీల పట్ల వైన్స్ యజమానులు అమానుషంగా ప్రవర్తించినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. తెల్లాపూర్ మున్సిపాలిటీలో ఓ మద్యం వ్యాపారి రేడియల్ రోడ్డు 7 ఎక్స్‌టెన్షన్‌లో ఓ వైన్స్ దుకాణాన్ని ఏర్పాటు చేశాడు. సాయంత్రం మందు రోడ్డుపై వాహనాలను నిలుపుతూ మందు కొనేందుకు క్యూ కడుతున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. మద్యం దుకాణం ముందు ఏర్పాటు చేసుకున్న సిబ్బంది మందుబాబులను కంట్రోల్ చేసేందుకు పెద్ద దుడ్డు కర్రలకు పని చెబుతున్నారు. గతంలో నారాయణరెడ్డి అనే కాంగ్రెస్ నాయకుడు తెల్లాపూర్ నుంచి నల్లగండ్లవైపు వెళ్తూ.. కారు ఆపి వైన్స్ వైపు వెళ్తుండగా బైక్ ఢీకొని తీవ్రగాయాలయ్యాయి.